ఎంబీబీఎస్ సీట్ల వ్యవహారంలో తప్పుడు నిర్ణయం



పేద పిల్లలకు వైద్యవిద్య అందాలనే తలంపుతో గత ప్రభుత్వం కొత్త మెడికల్ కళాశాలలను ఏర్పాటు చేసింది. దీంతో 700 దాకా ప్రభుత్వ కోటాలో నీట్‌లో క్వాలిఫై అయిన వారికి సీట్లు దక్కేవి. వీటిని ఇప్పటి కూటమి ప్రభుత్వం ప్రైవేటు వారికి ధారాదత్తం చేసింది. పులివెందుల మెడికల్ కళాశాలలో అన్ని సౌకర్యాలున్నా చంద్రబాబు ప్రభుత్వం తమకు ఆ సీట్లు వద్దంటూ లేఖ రాసి ఎంతోమంది నీట్ రాసిన విద్యార్థులను మోసం చేసింది. కేవలం ప్రైవేటు కళాశాలలు కొమ్ముకాసేందుకే ఈ పనిచేసిందని రాష్ట్రంలోని ప్రజలకు బాగా అర్థమైంది.

-గణేష్‌యాదవ్, పేరెంట్, పలమనేరు



పేద విద్యార్థులకు పెద్దశాపం..



గత ప్రభుత్వం ఏర్పాటు చేసిన మెడికల్ కాలేజీలను ప్రైవేట్‌పరం చేయడంతో పేద విద్యార్థులకు ఇది పెద్ద శాపం. ప్రభుత్వ కాలేజీల్లో తక్కువ ఫీజుతో వైద్యవిద్యను చదివే అవకాశం ఉంటుంది. ప్రైవేట్‌పరం చేయడంతో పేద విద్యార్థుల డాక్టర్ కలకలగానే మిగులుతుంది. కేవలం డబ్బు ఉన్న ధనిక పిల్లలు మాత్రమే డాక్టర్లు అవుతారు. పేద విద్యార్థుల్లో ఎంత టాలెంట్ ఉన్నా బూడిదలో పోసిన పన్నీరే అవుతుంది. దీన్ని ప్రభుత్వం గుర్తించాలి. పేద విద్యార్థులకు న్యాయం చేయాలి.

-గోవిందరాజులు, సాయి లేఔట్, వి.కోట

ప్రభుత్వమే నిర్వహించాలి..



గత ప్రభుత్వం ఏర్పాటు చేసిన మెడికల్ కళాశాలలను ప్రభుత్వమే నిర్వహించాలి. పాఠశాల స్థాయి నుంచి మంచి చదువులు అభ్యసించి ర్యాంకులు సాధించిన విద్యార్థులు చాలా మంది ఉన్నారు. అందులో ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో చదివిన విద్యార్థులే కీలకం. ఉన్నత చదువులు చదివి ఎంబీబీఎస్ చేయాలనుకునే నాలాంటి పేద విద్యార్థులకు ప్రైవేట్ కళాశాలలో ఫీజులు కట్టి చదవలేం. పేద విద్యార్థుల కలలను సాకారం చేసేందుకే ప్రభుత్వ పెద్దలు కృషిచేయాలి. మెడికల్ కళాశాలలను ప్రైవేటీకరణ చేయాలనే ప్రభుత్వ నిర్ణయం మార్చుకుంటే విద్యార్థుల భవిష్యత్ బావుంటుంది.

-గౌతమ్, బండమీదజరావారిపల్లి, గంగవరం మండలం

బాబు హామీలు.. నీటిపై రాతలు

సూపర్-6 అమలుపై చేతులెత్తేసిన బాబు

- చంద్రబాబు హామీలతో బురిడీ
- మండిపడుతున్న జనాలు

ఎలాగైనా అధికారంలోకి రావాలని చంద్రబాబు సూపర్ సిక్స్ పేరిట జనాన్ని నమ్మించి ఓట్లేసుకొని గద్దెనెక్కారు. సూపర్ సిక్స్ హామీలను నెరవేర్చడం కష్టమేనని సాక్షాత్తు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అసెంబ్లీలో చెప్పడం చూసిన జనం ఇప్పుడు మండిపడుతున్నారు. సెప్టెంబర్ 20 నాటికి కూటమి ప్రభుత్వం ఏర్పడి 100 రోజులు అవుతున్నా సూపర్‌సిక్స్ ఊసేలేదు. తల్లికి వందనం పథకం పేరిట ఇంట్లో ఎంతమంది పిల్లలు బడికెళుతుంటే ఒక్కొక్కరికి రూ.15వేలు, ప్రతి మహిళకు నెలకు రూ.1,500, రైతులకు ఏటా రూ.20వేలు, 20లక్షల ఉద్యోగాలు, నెలకు రూ.3వేల చొప్పున నిరుద్యోగభృతి, ఏటా మూడు సిలిండర్లు ఉచితం, మహిళలకు బస్సులో ఉచిత ప్రయాణమంటూ ఎన్నికలప్పుడు ఊదరగొట్టారు. తీరా అధికారంలోకి వచ్చాక హామీలను అటకెక్కించినట్టు.. ''సూపర్ సిక్స్ చూస్తేనే ఇప్పుడు భయమేస్తోంది'' నర్మగర్భంగా తన మాటల్లో చెప్పకనే చెప్పారు. ఓ వైపు ఖరీఫ్ సీజన్ మొదలైనా, పంట పెట్టుబడి సాయం, స్కూల్ తెరిచినా తల్లికి వందనం సాయం చేయలేదు. దీంతో రైతులకు, పిల్లల తల్లిదండ్రులకు ఇబ్బందులు తప్పలేదు. ఫ్రీబస్ ఎప్పుడో తెలియడం లేదు. నిరుద్యోగులకు కుచ్చుటోపీ పడింది. ఈ పథకాలపై అధ్యయనం చేసి ఆపై అమలు చేస్తామంటూ నిస్సిగ్గుగా దాటవేశారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో చెప్పిన తేదీకి అన్ని పథకాలు అమలైనట్టు కూటమిలోనూ ఉంటుందేమోనని నమ్మిన జనానికి ఇప్పుడిప్పుడే కూటమి అసలు రూపం అర్థమవుతోంది.

-పలమనేరు/పుంగనూరు/కుప్పం



పెట్టుబడి సాయం ఊసేలేదు



చంద్రబాబు ఎన్నికల సమయంలో ప్రతి రైతుకు సంవత్సరానికి రూ.20వేలు ఇస్తామన్నారు. ఇప్పటికే ఒక సీజన్ అయిపోయింది. వచ్చే వ్యవసాయ సీజన్‌కు అయినా ఇస్తారోలేదో తెలియదు. రైతులు, కౌలుదారులు పెట్టుబడికి డబ్బులు లేక చాలా మంది పంటల సాగు చేయలేదు. కుప్పం లాంటి వెనుకబడిన ప్రాంతంలో ప్రభుత్వ సాయం లేనిదే రైతులు సాగు పనులు చేసుకోవడం కష్టమే. కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి

-కదిరివేలు, ఊరునాయునిపల్లి, కుప్పం మండలం

నిరుద్యోగ భృతి ఇవ్వాలి



నేను ఎంకాం పూర్తి చేశాను. ప్రస్తుతం మా గ్రామంలోనే ఉంటూ ఓ ప్రైవేటు కార్యాలయంలో పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాను. చంద్రబాబు ఎన్నికల ముందు అధికారంలోకి వస్తే ప్రతి నిరుద్యోగికి నెలనెలా రూ.3వేలు నిరుద్యోగ భృతి ఇస్తానని హామీ ఇచ్చారు. చెప్పిన మాట ప్రకారం వెంటనే నిరుద్యోగ భృతి ఇవ్వాలి. అలాగే జాబ్ క్యాలెండర్ విడుదల చేయాలి.

-అఫ్రోజ్, భద్రాచలం (పెద్దపంజాణి మండలం)

తల్లికి వందనం ఎప్పుడిస్తారు.. ?



టీడీపీ కూటమి ఎన్నికల సమయంలో తల్లికి వందనం అమలు చేస్తామని చెప్పింది. ఎంత మంది పిల్లలుంటే అందరికీ ఏటా రూ.15 వేలు చొప్పున ఇస్తామన్నారు. ఇంతవరకు అతీగతీ లేదు. దానిపై ప్రస్తావనలేదు. నాకు ఇద్దరు పిల్లలున్నారు. రూ.30 వేలు రావాలి. ఇంతకు ఎప్పుడిస్తారో లేదా మోసం చేస్తారో తెలియడంలేదు.

-కళావతి, కొండామర్రి, చౌడేపల్లె మండలం



వైఎస్ జగన్ పాలనలో ఏడాదికి రైతులకు అందిన సాయం

రైతు భరోసా పథకం

నియోజకవర్గం	లబ్ధి (రూ. కోట్లలో)
పలమనేరు	61.28
పుంగనూరు	16.70
కుప్పం	7.78

అమ్మఒడి

నియోజకవర్గం	లబ్ధి (రూ. కోట్లలో)
పలమనేరు	60
పుంగనూరు	54.44
కుప్పం	29.64







కూటమి పాలనలో ఏడాదికి రైతులకు అందాల్సిన సాయం

అన్నదాత సుఖీభవ పథకం

నియోజకవర్గం	లబ్ధి (రూ. కోట్లలో)
పలమనేరు	90.79
పుంగనూరు	83.87
కుప్పం	78.62

తల్లికి వందనం

నియోజకవర్గం	లబ్ధి (రూ. కోట్లలో)
పలమనేరు	97.50
పుంగనూరు	103.29
కుప్పం	70



పలమనేరు, పుంగనూరు, కుప్పం నియోజకవర్గాలలో అర్హులైన మహిళలు

3,45,576

వీరికి నెలకు ఇవ్వాల్సిన భృతి

రూ.51.84 కోట్లు



పలమనేరు, పుంగనూరు, కుప్పం నియోజకవర్గాలలో అర్హులైన యువత

1,01,899

వీరికి నెలకు ఇవ్వాల్సిన భృతి

రూ.30.57 కోట్లు

ఉచిత బస్సు ప్రయాణం ఎప్పుడో..?



మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణమని ఎన్నికల టైంలో కూటమి నాయకులు ఊదరగొట్టారు. దీని కోసం మహిళలంతా ఎదురుచూస్తున్నారు. చంద్రబాబునాయుడు ఇచ్చిన హామీ మేరకు వెంటనే షరతులు లేకుండా ప్రభుత్వ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం అమలు చేయాలి. గతంలో లాగా ఇది కూడా మోసపువు హామీ నేనా..

-సావిత్రమ్మ, సదుం

రైతు సాయం ఎప్పుడో...?



సేద్యం పనులు ఇప్పటికే మొదలయ్యాయి. కొంత వరినారు కూడా వదిలాను. వరిపైరు నాటాల్సి ఉంది. ఇప్పటిదాకా టీడీపీ వోళ్లు చెప్పినట్టు రైతుకు రూ.20వేల సాయం అందలేదు. ఎప్పుడిస్తారో లేదో కూడా అనుమానంగా మారింది. గత ప్రభుత్వంలో జగన్ రైతుభరోసా, ఇన్‌పుట్ సబ్సిడీ, పంటలబీమా బాగానే వచ్చాయి. ఇప్పుడు నాలాంటి రైతుల పరిస్థితి ఎమవుతుందో ఆభగవంతునికే తెలియాలి.

-చంద్రప్ప, రైతు, ఎర్రినాగేపల్లి, వి.కోట మండలం

ఉచిత బస్సు ఏమైందో..?



మొన్న ఎన్నికలప్పుడు టీడీపీ నాయకులు ఇళ్లకాడికొచ్చి మాకంతా బస్‌ఫ్రీ అని చెప్పిరి. మా ఆడోళ్లంతా ఎంతో సంతోషపడితిమి. ఇప్పుడు సూస్తే ఇంకా ఏమీలేదు. ఇంతకూ ఫ్రీగా బస్సుల్లో ఎక్కనిస్తారో లేదో దిక్కుతోచలేదు. ఏమో నాయకుల మాట నమ్మి మా పక్కనే ఉన్న కర్ణాటకలో మాదిరిగా చేస్తారేమో అనుకుంటిమి. ఇప్పటిదాకా ఏమీ లేదు. ఖచ్చితంగా బస్సుల్లో ఫ్రీ పెట్టాల్సిందే.

-శశికళ, వి.కోట

మూడు సిలిండర్లు ఇస్తారనుకున్నా..?



నెలనెలా గ్యాస్ కొనాలంటే మాలాంటి పేదోళ్లకు చాలా ఇబ్బంది. మొన్న ఎలక్షన్‌కు టీడీపీ వోళ్లు ఏడాదికి మూడు సిలిండర్లు ఉచితంగా ఇస్తామని చెప్పారు. ఈ పార్టీ గెలిచి మూడునెలలైనా ఇంతవరకు సిలిండర్ మాటే లేదుకదబ్బా. మా ఊరోళ్లు కొందరు అవంతా ఉత్తిమాటలే పెద్దమ్మా అంటున్నారు. ఆశపెట్టించి ఇట్లా మోసం చేస్తే ఎట్టా నాయనా.

-సరోజమ్మ, వి.కోట

పంటసాగు పెట్టుబడి ఇవ్వరా..?



ఖరీఫ్ సీజన్ ఇప్పటికే ప్రారంభమైంది. పంటలు సాగు చేసుకోవాలి. వర్షాలు కూడా పడుతున్నాయి. గత ప్రభుత్వంలో ఈపాటికే మాకు రైతు భరోసా అందింది. ప్రతిఏటా ఇచ్చిన హామీ మేరకు రైతులను ఆదుకున్నారు. కూటమి నేతలు అన్నదాత సుఖీభవ కింద రూ.20 వేలు ఇస్తామన్నారు. ఇంతవరకు అతీగతీలేదు. రైతులంటే అలుసా.

-సాధిక్ బాషా, ఖాన్‌సాబ్‌మిట్ట, చౌడేపల్లె మండలం

మహిళలకు నెలకు రూ.1500 ఇవ్వాల్సిందే



ఇంట్లో ఉన్న ప్రతి మహిళకు నెలకు రూ.1,500 ఇస్తామని ఎన్నికల్లో కూటమి వాళ్లు నమ్మకంగా చెప్పిరి. ఇంతవరకు దీనిపై అతీగతీలేదు. ప్రచారానికి వచ్చినప్పుడేమో మీకు, మీకు అంటూ అందరికీ డబ్బులేనంటూ లెక్కలు చెప్పారు. అసలు ఇస్తారో లేదో అనుమానం ఉంది. కానప్పుడు చెప్పకుండా ఉండాల్సింది. పెడతామంటే ఆశ, కొడతామంటే భయం కదా. కానీ మా ఆడోళ్లు ఇచ్చేంతవరకు వదలం.

-మేనక, ఈశ్వర్‌నగర్

క్లుప్తంగా

పాఠశాల తనిఖీ

సదుం: మండలంలోని చింతలవారిపల్లె ప్రాథమిక పాఠశాలను బుధవారం తనిఖీ చేసినట్లు ఎంఈఓ-1 శ్రీరాములు, ఎంఈఓ-2 దామోదర తెలిపారు. తనిఖీ సమయంలో టీచర్ సునీల్‌కుమార్‌రెడ్డి బయోమెట్రిక్ వేసి పాఠశాలలో లేనట్లు గుర్తించామన్నారు. దీనిపై ఆయనకు మెమో జారీ చేసినట్లు తెలిపారు.

హెచ్‌ఐవీపై అవగాహన పెంచుకోవాలి

కల్లూరు(రొంపిచెర్ల): హెచ్‌ఐవీపై విద్యార్థులు అవగాహన పెంచుకోవాలని ఎంఈఓ సిద్ధరామయ్య అన్నారు. ఆయన కల్లూరు ఉన్నత పాఠశాలలో కోర్ సంస్థ హెచ్‌ఐవీ, ఎయిడ్స్, టీబీ, సుఖవ్యాధులపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఎంఈఓ తాతయ్య, హెచ్‌ఎం వల్లీ, కోర్ సంస్థ ప్రతినిధి రాజమ్మ, షర్మిల, రెడ్డిరాణి పాల్గొన్నారు.

యూట్యూబర్లపై మండిపాటు

పలమనేరు: పట్టణంలోని ఓ ప్రైవేటు పాఠశాలలో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తుండగా పట్టణానికి చెందిన కొందరు యూట్యూబర్లు బడి గోడదూకి లోనికెళ్లి వీడియోలు తీసి యాజమాన్యాన్ని భయాందోళనలకు గురిచేయడంపై విద్యార్థుల తల్లిదండ్రులు బుధవారం మండిపడ్డారు. దీనిపై స్కూల్‌యాజమాన్యం సైతం పోలీసులకు ఫిర్యాదు చేస్తామని తెలిపింది.

దరఖాస్తు చేసుకోండి

పలమనేరు: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో డీఏహెచ్ (అనిమల్ హస్బెండరీ), కెమిస్ట్రీ బోధించేందుకు ఆసక్తి గల వారు కాంట్రాక్ట్ విధానంలో పనిచేసేందుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు కళాశాల ప్రిన్సిపల్ డా, బాబు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆయా సబ్జెక్టుల్లో ఎమ్మెస్సీ పూర్తి చేసిన వారు ఇందుకు అర్హులని ఈనెల 25లోపు కళాశాల ప్రిన్సిపల్‌ను సంప్రదించాలని అందులో పేర్కొన్నారు.

టీచర్ ట్రైనింగ్ సెంటర్ల తనిఖీ

పలమనేరు: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులకు బోధనపై సాగుతున్న శిక్షణ కేంద్రాలను ఎంఈఓ లీలారాణి బుధవారం తనిఖీ చేశారు. స్థానిక బాలికోన్నత పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ శిక్షణలో నేర్చుకున్న అంశాలు ఉపయోగపడతాయని పేర్కొన్నారు.

చెకుముఖి టాలెంట్ పోస్టర్ల ఆవిష్కరణ



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎంఈఓ

బైరెడ్డిపల్లె: బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఈనెల 25న పాఠశాల స్థాయిలో నిర్వహిస్తున్న చెకుముఖి టాలెంట్ టెస్ట్ కరపత్రాలు, ప్రచార పోస్టర్లను బుధవారం ఎంఈఓ సుబ్రమణ్యం ఆవిష్కరించారు. ఎంఈఓ సుబ్రమణ్యం మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగి ఉన్న నైపుణ్యాన్ని గుర్తించేందుకు నిర్వహిస్తున్న టాలెంట్ టెస్ట్‌ల్లో 8, 9, 10వ తరగతి విద్యార్థులు అందరూ పాల్గొనాలని ఈసందర్భంగా ఆయన పిలుపునిచ్చారు. పాఠశాల స్థాయిలో ఈనెల 25న, అక్టోబర్ 1న మండల స్థాయిలో, అక్టోబర్ 27న జిల్లా స్థాయిలో, నవరంబర్ 9, 10 తేదీల్లో రాష్ట్రస్థాయిలో జరుగుతాయని ఆయన తెలిపారు. జన విజ్ఞాన వేదిక కన్వీనర్ శశికుమార్, ఉపాధ్యాయులు సంగీత, నసీఫ్‌జాన్, రత్నమ్మ, ప్రకాష్ పాల్గొన్నారు.

ఆక్రమణ భూములు స్వాధీనం

గుడుపల్లె: అన్యాక్రాంతమైన ప్రభుత్వ భూములను రెవెన్యూ అధికారులు బుధవారం సర్వే చేసి బోర్డు నాటి స్వాధీనం చేసుకున్నారు. ఆగస్టు 29న కుప్పంలో జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్‌గాంధీ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రజా పరిష్కార వేదికలో గుత్తర్లపల్లె గ్రామస్తులు ప్రభుత్వ భూములు ఆక్రమణకు గురయ్యాయని ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. స్పందించిన కలెక్టర్ వెంటనే సర్వే చేసి స్వాధీనం చేసుకోవాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు గుడుపల్లె తహసీల్దార్ సీతారాం, రెవెన్యూ అధికారులు, సర్వేయర్లతో కలసి గుత్తర్లపల్లె సమీపంలోని నక్కనపల్లె గ్రామ రెవెన్యూలో సర్వే నంబర్ 62లో 15 ఎకరాల విస్తీర్ణంలో సర్వే చేయించి ప్రభుత్వ భూమిగా గుర్తించారు. భూమిలో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. సర్పంచ్ నాగరాజు పాల్గొన్నారు.

మున్సిపల్ ఉద్యోగుల బదిలీ

పుంగనూరు: మున్సిపాలిటీలో పనిచేస్తున్న పలువురు ఉద్యోగులను బదిలీ చేస్తూ డీఎంఏ మంగళవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. మున్సిపాలిటీలో పనిచేస్తున్న సీనియర్ అసిస్టెంట్లు జ్ఞానప్రకాష్, గోపినాథ్, రెడ్డీశ్వరి, తిరుమలరావు, వినోద్‌ప్రీతంలను మదనపల్లె మున్సిపాలిటీకి బదిలీ చేశారు. అలాగే మదనపల్లెలో పనిచేస్తున్న నాగరాజు, కె.శ్రీనివాసులు, సద్దామ్‌హుస్సేన్, రెడ్డిమస్తాన్, రామకృష్ణ, సహదేవుడులను పుంగనూరుకు బదిలీ చేశారు. వీరితో పాటు పలమనేరులో పనిచేస్తున్న మునివెంకటప్పను, శ్రీకాళహస్తిలో పనిచేస్తున్న జయకుమారిని ఇక్కడికి బదిలీ చేశారు. నూతన ప్రభుత్వం ఉద్యోగుల బదిలీలు చేపట్టడంతో మూకుమ్మడిగా బదిలీలు జరుగుతున్నాయి.

పెద్దబాలశిక్ష పుస్తకాల పంపిణీ

పలమనేరు: పలమనేరు, గంగవరం మండలాల ప్రభుత్వ పాఠశాలలకు కొలమాసనపల్లి హెచ్‌ఎం ఈశ్వర్‌ప్రసాద్ ముద్రించిన పెద్దబాలశిక్ష పుస్తకాలను బుధవారం ఆయా పాఠశాలల హెచ్‌ఎంలకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కమ్యూనిటీ మొబలైజింగ్ ఆఫీసర్ ఉదయలక్ష్మి, తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి అధ్యక్ష, కార్యదర్శులు తులసీనాథంనాయుడు, పుష్ప, ఎంఈఓలు లీలారాణి, బాలసుందరం పాల్గొన్నారు.



పెద్దబాలశిక్ష పుస్తకాలతో ఉపాధ్యాయులు

శాశ్వత పరిష్కారానికి చర్యలు

వి.కోట: పట్టణంలో మేఘన అనే అమ్మాయి డెంగీతో మరణించడం చాలా బాధాకరమణి సర్పంచ్ పీఎస్ లక్ష్మీ అన్నారు. ఈసంఘటనతో బుధవారం యుద్ధప్రాతిపదికన పారిశుధ్యపనులు చేపట్టినట్లు అంతేకాక జరిగిన సంఘటనను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి గంగమ్మ ఏరుకు సిమెంట్ కాలువ మంజూరుకు శాశ్వత పరిష్కారం చేపడతామని తెలిపారు.

స్వచ్ఛతా హీ సేవ అవగాహన ర్యాలీ

పలమనేరు: మున్సిపల్ అధికారులు బుధవారం స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంపై అవగాహన కల్పిస్తూ స్వచ్ఛతా రన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో స్థానిక ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు పాల్గొన్నారు. ఆపై పట్టణంలో దోమలు ఎక్కువగా ఉన్న చోట్ల మలాథిన్ ద్రావణాన్ని చల్లారు. మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డి పాల్గొన్నారు.

మిలాద్ ఉన్ నబి వేడుకలు



రామాపురం రోడ్డులో ప్రార్థనలు స్తున్న ముస్లింలు

పుంగనూరు: మిలాద్ ఉన్ నబి సందర్భంగా ముస్లింలు భక్తిశ్రద్ధలతో ప్రార్థనలు నిర్వహించారు. బుధవారం బట్టందొడ్డిరోడ్డు రామాపురంలో మదీనామసీదుకు చెందిన ముస్లిం పెద్దలు అబీబ్‌సాబ్, ఇక్తియార్‌బాషా, హనీఫ్, అంజాద్, సమివుల్లా, కరీముల్లా వారి ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా పచ్చజెండాలు పట్టుకుని అల్లాను ప్రార్థిస్తూ ర్యాలీ నిర్వహించారు. అక్కడే అన్నదాన కార్యక్రమాలు నిర్వహించి, ప్రార్థనలు జరిపారు. ముస్లిం పెద్దలు మహమ్మద్ హనీఫ్, బావాజాన్, బాబు, నూర్, షావలి, ముబారక్‌ఆలి, సమివుల్లా, కబీర్‌అహ్మద్, ఖాజాపీర్ పాల్గొన్నారు.

రూ.40వేల ఇంజక్షన్ ఉచితంగానే..

పలమనేరు: గుండెపోటు వచ్చినవారికి వెంటనే వేసే ఇంజక్షన్ స్థానిక ఏరియా ఆస్పత్రిలో ఉచితంగానే వేసి ప్రాణాలను కాపాడడం జరుగుతుందని పలమనేరు ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డా.మమతారాణి తెలిపారు. స్థానిక ఆస్పత్రిలో బుధవారం ఆమె 108 సిబ్బందితో సమావేశాన్ని నిర్వహించారు. గుండెపోటు వచ్చిన వ్యక్తికి పది నిమిషాల్లో దీన్ని ఇంజక్షన్ వేస్తే ప్రాణాలను కాపాడే అవకాశం ఉంటుందని తెలిపారు.

అంగన్‌వాడీలదే ముఖ్యపాత్ర

కుప్పంరూరల్: ఆరోగ్యకర సమాజం నిర్మించడంలో అంగన్‌వాడీలదే ముఖ్యపాత్ర అని కుప్పం మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు అన్నారు. బుధవారం కుప్పం పట్టణం, ముత్తుమారెమ్మగుడి రోడ్డులోని మోడల్ అంగన్‌వాడీ కేంద్రంలో పౌష్టికాహార మాసోత్సవాల్లో భాగంగా గర్భవతులు, బాలింతలకు అంగన్‌వాడీల్లో అందించే పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. అనంతరం సామూహిక సీమంతాలు నిర్వహించారు. కౌన్సిలర్లు దాము, సోము, జాకీర్, సూపర్‌వైజర్ దిల్‌షాద్, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.



గర్భవతికి సీమంతం చేస్తున్న అంగన్‌వాడీలు

అంటుకట్టు మొక్కలతో అధిక దిగుబడి

కుప్పంరూరల్: అంటుకట్టు మొక్కలతో సాగు చేయడం ద్వారా అధిక దిగుబడి సాధించవచ్చని చిత్తూరు జిల్లా ఉద్యానాధికారి మధుసూదన్‌రెడ్డి అన్నారు. కుప్పం మండలం, పెద్దబంగారునత్తం వద్ద ఉన్న సీఓఈ (సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్)లో ఆల్ ఇండియా ఉద్యానాధికారులకు శిక్షణ కార్యక్రమంలో భాగంగా రెండవ రోజు ఆయన పాల్గొని అధికారులను ఉద్దేశించి మాట్లాడారు. తమిళనాడు రాష్ట్రం సీఓఈ తలి కేంద్రం ఏడీ ఆర్ముగం, వివిధ రాష్ట్రాలకు చెందిన 40 మంది ఉద్యానాధికారులు, పలమనేరు ఏడీ కోటేశ్వరరావు, కుప్పం ఉద్యానాధికారి డింపుప్రియ ఉన్నారు.



సూచనలు ఇస్తున్న తమిళ ఉద్యానాధికారులు

ఖోఖో విన్నర్స్ శంకర్రాయలపేట

పెద్దపంజాణి: మండలంలోని శంకర్రాయలపేట జెడ్పీ హైస్కూల్ మైదానంలో బుధవారం స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అధ్వర్యంలో మండల స్థాయి ఖోఖో పోటీలు నిర్వహించారు. శంకర్రాయలపేట జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు ఖోఖో సీనియర్ బాయ్స్, జూనియర్ బాయ్స్, జూనియర్ గర్ల్స్‌లో విన్నర్స్‌గా నిలిచినట్లు పాఠశాల హెచ్‌ఎం వేదవతి తెలిపారు. అదేవిధంగా ఖోఖో సీనియర్, జూనియర్ బాయ్స్ రన్నర్స్‌గా చిన్నేపల్లి ఉర్దూ హైస్కూల్, సీనియర్ గర్ల్స్ విన్నర్స్‌గా ఎస్ఆర్ పేట మహాత్మా జ్యోతిభా పూలే, జూనియర్ గర్ల్స్ రన్నర్స్‌గా అమ్మరాజుపల్లి హైస్కూల్ విద్యార్థులు గెలుపొందినట్లు ఆమె పేర్కొన్నారు. సర్పంచ్ హరినాథ్, వ్యాయామ ఉపాధ్యాయుడు దొరై, ఎస్ఎంసీ చైర్మన్ వెంకట్రమణ పాల్గొన్నారు.



ఖోఖో విజేతలతో పాఠశాల ఉపాధ్యాయులు

ఆస్తిపన్ను చెల్లించకుంటే నీళ్లు కట్

పుంగనూరు: మున్సిపాలిటీ పరిధిలో ఆస్తి, నీటి పన్ను చెల్లించని వారి ఇళ్లకు నీటి సరఫరాను కట్ చేస్తూ మున్సిపల్ కమిషనర్ మధుసూదన్‌రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. బుధవారం ఈ మేరకు ఆర్ఓ సతీష్ కమలాకర్ ఆధ్వర్యంలో సచివాలయ, మున్సిపల్ ఉద్యోగులు సూర్యనగర్‌లో బకాయిలు ఉన్న వారి ఇంటి కొళాయి కనెక్షన్లను తొలగించారు. కమిషనర్ మాట్లాడుతూ మున్సిపాలిటీకి చెల్లించాల్సిన ఆస్తి, నీటి పన్నులను చెల్లించకపోవడంతో అభివృద్ధి కుంటుపడుతోందన్నారు. పలుమార్లు తాఖీదులు ఇచ్చిన పన్నులు చెల్లించకపోవడంతో కఠినచర్యలు తీసుకోవాల్సి వస్తోందన్నారు. బకాయిదారులు తక్షణమే పన్నులు చెల్లించి, మున్సిపాలిటీ అభివృద్ధికి సహకరించాలన్నారు. లేకుంటే బకాయిదారులకు మున్సిపాలిటీ నుంచి అన్ని సౌకర్యాలు కట్ చేస్తామని హెచ్చరించారు.



నీటి కొళాయిలు తొలగిస్తున్న ఆర్ఓ